క్లుప్తంగా

ఐదుగురు జూదరుల అరెస్ట్

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించామని ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణి బుధవారం తెలిపారు. గ్రామంలోని మామిడి తోట దగ్గర ఉన్న రజకుల చెరువు వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో శిబిరంపై దాడిచేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి సుమారు రూ. 5220 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని గురువారం కోర్టుకు తరలిస్తామని ఎస్‌ఐ నాగకళ్యాణి తెలిపారు.

ప్రశాంతంగా ఎస్‌ఏ -1 పరీక్షలు



ముదినేపల్లి రూరల్ : వడాలి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మండలంలోని వడాలి-1, వడాలి-2, కోమర్రు ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను చైర్మన్ కాంప్లెక్స్ చైర్మన్ బీవీఎస్‌ఎస్ నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక విద్యార్థులు పైతరగతుల్లో పరీక్షలు రాసేందుకు, అభ్యసనా సామర్థ్యాలను పెంచుకునేందుకు పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్షలు జరుగుతున్న తీరు గురించి చైర్మన్‌కు వివరించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

తోట్లవల్లూరు: టెన్త్ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని పెనమకూరు సర్పంచ్ నందేటి గంగాభవాని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను బుధవారం ఆమె విద్యార్థులకు పంపిణీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందును విద్యార్థులు బాగా చదువుకోవాలని గంగాభవాని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మరీదు వెంకటశివ మధుబాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిన్నెల ఓంకారేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

పామర్రు: నిరుపేదలైన వారికి దాతలు ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం వద్ద దాత సహకారంతో నిరుపేదలకు ఆహారపు పొట్లాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్థానికులు నందిపాటి రవిశంకర్ రెడ్డి, రమాదేవి దంపతుల కుమార్తె శర్మిక ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగంలో స్థిర పడిన సందర్భంగా వారి సౌజన్యంతో 50 మంది నిరుపేదలకు ఆహారపు పొట్లాలను పంపిణీ చేశామన్నారు. మానవ సేవే మాధవ సేవ అని ప్రార్థించే చేతుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న సూక్తులను అందరూ పాటించి సమాజంలోని అసమానతలు తొలగేలా కృషి చేయాలని అన్నారు. వైఎస్ బోసు,ఎంఆర్‌కె ఆచార్యులు, ఎన్ నాగిరెడ్డి, కె వీరయ్య, జీ అచ్చియ్య, బీ సాయిబాబు, వీ నాగేశ్వరరావు, బీ రాధాకృష్ణారెడ్డి, బీ సీతారామిరెడ్డి, పీ సాయిబాబు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కైకలూరు: రహదారుల నిబంధనలను వాహనదారులు ఖచ్చితంగా పాటించాలని పట్టణ సీఐ ఎంవీఎస్.నాగరాజు సూచించారు. హెల్మెట్లు లేని వాహనదారులు, చలానాలు కట్టాల్సిన వాహనాల గుర్తింపు తనిఖీల కార్యక్రమం కైకలూరులో బుధవారం చేపట్టారు. ఈ తనిఖీల్లో 47 వాహనాలకు ఈ-చలానా కేసులకు సంబంధించి రూ.10,745, పెండింగ్ చలానాలకు 25 వాహనదారుల నుంచి రూ.5245 వసూలు చేశామని సీఐ చెప్పారు. టౌన్ ఎస్సై గాయత్రీ, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

కూచిపూడి ఎస్‌ఐ బదిలీ



కూచిపూడి (మొవ్వ): పామర్రు సర్కిల్‌లోని కూచిపూడి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కే దుర్గాప్రసాదరావు బదిలీ అయ్యారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో రిపోర్ట్ చేశారు. గత ఏడాది మార్చి 11న కూచిపూడి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం రిలీవ్ అయ్యారు.

పురుగులు, తెగుళ్ల అంచనాపై సర్వే

మండవల్లి : మండలంలోని అల్లినగరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో రసాయనిక వ్యవసాయ మినుము పంటలో పురుగులు, తెగుళ్ల ఆంచనాకు సర్వే నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సర్వేలో మరూకా మచ్చల పురుగును, పొగాకు లద్దె పురుగు గుర్తించామన్నారు. దాని ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయికన్నా తక్కువ ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా లింగాకర్ష బుట్టలు, పసుపు పళ్లాలు, తుది నిర్ణయంగా బ్రహ్మాస్త్రం పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ప్రతి బుధవారం సర్వే నిర్వహిస్తామని చెప్పారు. మాస్టర్ ట్రయినర్ పృధ్వీరాజు, సీఆర్పీ నాగవిజయ, ఐసీఆర్పీలు ఉషారాణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)
- సంక్రాంతి సందర్భంగా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ముదినేపల్లి రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ పండుగల వేళ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ షణ్ముఖసాయి ఆధ్వర్యంలో మండలంలోని గురజలో టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధి యువతపైనే ఆధారపడి ఉన్నందున అలాంటి జూదాలకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటే ఉజ్వల భవిష్యత్తును చూడవచ్చన్నారు. ఈ దిశగా యువతను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన కైకలూరు రూరల్ సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్‌ఐ షణ్ముఖసాయి అభినందనీయులని కొనియాడారు. టోర్నమెంట్‌లో విజేతలైన జట్లకు బహుమతులు ఇచ్చేందుకు వచ్చిన ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు దంపతులు వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల కిషోర్ అభినందనీయులన్నారు. సీఐ వైవీఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ పోలీసులకు సహకరించి జూదాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వైస్ ఎంపీపీ రాచూరి రాధా, సర్పంచ్ మంచాల సరస్వతీ, సొసైటీ అధ్యక్షుడు మేడూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, మరీదు నాగయ్య, బేతపూడి వెంకటరమణ, కోటే ప్రవీణ్, మరీదు వసంతరావు, జాస్తీ రాజేంద్రప్రసాద్, పుట్టి సుబ్బారావు, ముప్పిడిశెట్టి వెంకటేశ్వరరావు, తోట ధనుంజయ, పేర్ని పృధ్వీ, పగడాల నాగు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ముదినేపల్లి రూరల్ : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గురజలో బుధవారం ప్రారంభించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రారంభించారు. మొదటి మ్యాచ్ గురజ, కోడూరు మధ్య జరగ్గా గురజ జట్టు పది ఓవర్లలో 70 పరుగులు చేసింది. కోడూరు జట్టు 42 పరుగులకే ఆల్‌ఔట్ కాగా 28 పరుగులతో గురజ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్ మండవల్లి, కొత్తపల్లి జట్ల మధ్య జరగ్గా మండవల్లి జట్టు ఒక వికెట్ నష్టపోయి విజయం సాధించింది. పెదతుమ్మిడి, వాడవల్లి జట్ల మధ్య హోరాహోరీగా పోటీ జరగ్గా 15 పరుగులతో పెదతుమ్మిడ విజయం సాధించింది. ఈ పోటీలను ఎస్‌ఐ షణ్ముఖసాయి పర్యవేక్షిస్తున్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వక్తలు
- ఘనంగా వారోత్సవాలు



కైకలూరులో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్



పెన్షన్ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు

కైకలూరు: దళారులు, పైరవీకారుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు అందిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు, కల్యాణ మండపంలో 310 మందికి మంజూరైన నూతన పింఛన్లను బుధవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అడివి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు ఇచ్చిన పింఛన్ నెలకు కేవలం రూ.1000 మాత్రమే అన్నారు. సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ రూ.2,250 నుంచి 2,750 వరకు పెంచి అందిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ చైర్మన్ కొండరాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, నల్లగచ్చు ధనలక్ష్మీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు సోమల శ్యామ్‌సుందర్, ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు, ఈవోపీఆర్డీ రవిశంకర్, వివిధ గ్రామాల పంచాయతీల సెక్రటరీలు, సచివాలయ పార్టీ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: పేదల సంక్షేమమే లక్ష్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పెంపు వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఎంపీడీవో అనగాని వెంకటరమణ పింఛన్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల నుంచి మరో 206 నూతన పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ప్రతిపక్షాలు పింఛన్లు తొలగిస్తున్నారని అర్థంలేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పు దోవపట్టిస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దే రాము, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ పింఛన్లు

గుడివాడరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను అందజేస్తామని వైస్ ఎంపీపీ గుంజా వంశీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తటివర్రు పంచాయతీ వద్ద గ్రామంలో నూతనంగా 6 పెన్షన్లు, మిగిలిన 100 సామాజిక పెన్షన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంజి నిర్మలకుమారి, పంచాయతీ కార్యదర్శి ఆర్‌వీ కృష్ణ, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోసపాడు(పెదపారుపూడి): అర్హతే ప్రామాణికంగా ప్రతి అర్హతే ప్రామాణికంగా పెన్షన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండలంలోని దోసపాడు కల్యాణ మండపంలో మండలంలో కొత్తగా మంజూరైన వివిధ రకాల పింఛన్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో కొత్తగా 124 పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. పెన్షన్ తొలగిస్తున్నామని టీడీపీ దుర్మార్గపు ప్రచారాన్ని చేస్తోందని, ప్రజలందరు తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో సీతామహాలక్ష్మీ, వైస్‌ఎంపీపీ పొనుగుమాటిరజిని, ఎంపీటీసీలు చిగురుపాటి అశోక్‌కుమారి, మద్దాలి జ్యోతి, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, సర్పంచ్‌లు విక్కుర్తి స్వాతి, జువ్వనపూడి రాజు, ప్రత్తిపాటి హర్షవర్థన్, నాగదేశి సుబ్రహ్మణ్యం, గోళ్ల సోమేశ్వరరావు, పాతూరి రమేష్, పుణుకొల్లు శివరామప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కొమరవోలు (పామర్రు): మండల పరిధి కొమరవోలు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి దిరిశం రత్నకుమారి మాట్లాడుతూ పెరిగిన పింఛన్ ప్రకారం రూ.2,750 వంతున లబ్ధిదారులకు అందజేశామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం వలన ఎంతో మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శింగవరపు రామచంద్రరరావు, ఎంపీటీసీ కారుమంచి నాగమల్లేశ్వరరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కంకిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రాజెక్టు సీడీపీఓ కె.బి.సుకన్య తెలిపారు. బుధవారం ఆమె స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు మండలం కుందేరు-2 అంగన్‌వాడీ కార్యకర్త (జనరల్), కంకిపాడు-10 (మినీ అంగన్‌వాడీ కార్యకర్త) (బీసీ-బీ), అంగన్‌వాడీ సహాయకురాలు ఈడుపుగల్లు-1 (ఎస్‌సీ), కంకిపాడు-8 (జనరల్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పెనమలూరు మండలంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు పెనమలూరు-3 (బీసీ-బీ), వణుకూరు-1 (ఎస్‌సీ), యనమలకుదురు-8 (బీసీ-బీ) ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాలను రిజర్వు చేసిన ప్రకారం అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కంకిపాడు ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా అందించాలని సూచించారు.

మునగతో రక్తహీనత నివారణ

ఉంగుటూరు: రక్త హీనత ఉన్న వారికి మునగ మేలు చేస్తుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మునగ మొక్కల పంపిణీ బుధవారం జరిగింది. మధిరపాడులో జరిగిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని డ్వాక్రా మహిళలకు మొక్కలు అందజేశారు. మహిళలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు మునగ సహాయపడుతుందని అన్నారు.

కైకాల మృతి కాపు సంఘీయులకు తీరని లోటు



అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్న కాపు సంఘ నాయకులు

గుడివాడ రూరల్: నట సార్వభౌమ కైకాల సత్యనారాయణ మరణం కాపు సంఘీయులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని గుడివాడ కాపు సంఘం నాయకులు ఆకాంక్షించారు. స్థానిక ఏజీకే పాఠశాల వద్ద కైకాల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దివంగత వంగవీటి మోహనరంగా, కైకాల సత్యనారాయణ చిత్రపటాలకు నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కాపు సంఘ నాయకుడు గోకరకొండ బలరామ్ మాట్లాడుతూ తమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన కైకాల మరణం తీరనిలోటన్నారు. కైకాలకు గుడివాడతో విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, జనసేన నేత బూరగడ్డ శ్రీకాంత్, కాపు సంఘ నాయకులు పంచకర్ల వెంకట్, ఎస్‌ఎస్ నాయుడు, పొన్నూరు రామకృష్ణ పాల్గొన్నారు.

90 పశువులకు వైద్య పరీక్షలు



గుడివాడ రూరల్: పాడి రైతులు పశువుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్థకశాఖ వైద్యులు హనుమంతరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని బిళ్లపాడు పంచాయతీ ఏరియాలోఉన్న చిన ఎరుకపాడు గ్రామంలో లయన్స్ క్లబ్ ప్రగతి గుడివాడ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ ప్రగతి జోన్ చైర్మన్ రామదేని వేణుబాబు శిబిరాన్ని ప్రారంభించారు. జోన్ చైర్మన్ వేణుబాబు మాట్లాడుతూ ఉపద్రష్ట వెంకటసత్యగాయత్రి జ్ఞాపకార్థం ఆమె కుమారులు వితరణతో ఈ పశు వైద్య శిబిరాన్నినిర్వహించడంఅభినందనీయమన్నారు. కాగా ఈ శిబిరంలో 90 పశువులకు పశు వైద్యులు వేణు, హనుమంతరావు పరీక్షలు నిర్వహించి ప్రగతి క్లబ్ ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రగతి అధ్యక్షుడు మల్లంపల్లి వెంకట్రావ్, కోశాధికారి నవీన్, జిల్లా నాయకుడు ఉపద్రష్ట రాంబాబు, ఎం.వీరశేఖర్, పాడి రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఉచిత ప్రసూతి సేవలు

కూచిపూడి (మొవ్వ): మండలంలోని కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో గర్భిణులకు ఉచిత ప్రసూతి సేవలు అందిస్తున్నట్లు హాస్పటల్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, ప్రసూతి సేవల వైద్యనిపుణులు డాక్టర్ తాతా సీలియ వివరాలు తెలుపుతూ గర్భం ధరించిన నాటి నుంచి వైద్యసేవలు అందిస్తామని, ఉచితంగా సాధారణ/సిజేరియన్ డెలివరీలు చేస్తారని వివరించారు. 365 మందికి వైద్య సేవలు అందిస్తామని ఫిబ్ర వరి 28లోగా హాస్పటల్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్, నెలవారి చెకప్ కన్సల్టేషన్, రక్త పరీక్షలు, డెలివరీ సమయంలో సర్జరీ ఖర్చు, మత్తు డాక్టర్ ఖర్చు, స్టెరిలైజేషన్ ఖర్చు, పోస్ట్ ఆపరేషన్ కేర్ ఖర్చు, బెడ్, వార్డు ఖర్చు, డాక్యుమెంటేషన్ ఖర్చు లు లేకుండా సేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

భవిత కేంద్రంలో విద్యార్థులకు భోజనం



ముదినేపల్లి రూరల్: స్థానిక భవిత సెంటర్‌లోని దివ్యాంగుల విద్యార్థులకు బుధవారం నుంచి మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో పీ మల్లీశ్వరి ప్రారంభించారు. జెడ్పీ సీఈవో రవికుమార్ మంగళవారం భవిత కేంద్రాన్ని పరిశీలించిన నేపథ్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంపీడీవోకు సూచించారు. దీంతో వడాలి జెడ్పీహైస్కూల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఇక్కడి విద్యార్థులకు అందజేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఎంపీడీవో తెలిపారు. సీఈవో ఆదేశాలను వెంటనే అమలు చేసి విద్యార్థుల సమస్యను పరిష్కరించినందుకు తల్లిదండ్రులు ఎంపీడీవోను అభినందించారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో స్వర్ణకాంతులు

- ఎమ్మెల్యే డీఎన్నార్
- లోకుమూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి : నవరత్న పథకాలతో పేదల జీవితాలలో స్వర్ణకాంతులీనుతున్నాయని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని లోకుమూడిలో సర్పంచ్ కర్రేటి నాగమణి, ఎంపీటీసీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌లను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ అర్హులకు నివేశన స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు కేటాయిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని తెలిపారు. లోకుమూడి గ్రామంలో వేలిముద్రలు పడకపోవటంతో పింఛన్ ఇవ్వడం లేదని మత్తే కనకరత్నం అనే మహిళ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చింది. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, మండల వ్యవసాయ మండలి అధ్యక్షురాలు జంగం వరలక్ష్మి, సర్పంచ్‌లు కర్రేటి నాగమణి, తలారి ధనలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు దత్తాడ నరశింహారావు, నాయకులు మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, కరేటి శివకృష్ణ, తలారి వెంకటస్వామి, ఎస్సై టి.రామకృష్ణ, బొమ్మనబోయిన గోకర్ణ, హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రానివ్వొద్దు

ఆర్‌డీఓ విజయకుమార్



తోట్లవల్లూరులో ఆర్‌బీకే సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డీఓ విజయకుమార్

తోట్లవల్లూరు: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దని ఉయ్యూరు ఆర్‌డీఓ విజయకుమార్ ఆదేశించారు. తోట్లవల్లూరు సౌత్, నార్త్ ఆర్‌బీకేలు, యాకమూరులోని కృష్ణకాంత్ రైస్‌మిల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను విజయకుమార్ తెలుసుకున్నారు. గోనె సంచుల లభ్యత గురించి ఆరా తీశారు. రైతులకు ఇబ్బంది లేకుండా గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. తడిసిన, రంగుమారిన, ముక్కవుతున్న ధాన్యాన్ని సైతం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు.

లంక భూముల పరిశీలన..

తోట్లవల్లూరు లంకలోని సొసైటీ భూములను తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనుభవదారులుగా ఉన్న రైతుల గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీని కోసం రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించినట్లు వెంకటశివయ్య చెప్పారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, ఎంఏవో నాగేశ్వరరావు, మండల సర్వేయర్ సురేష్, రివర్ కన్జర్వేషన్ ఏఈఈ మహేశ్వరి, ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం కోనుగోలు చేస్తాం

పాములపాడు (పెదపారుపూడి): రంగుమారిన, పాయ వచ్చిన ధాన్యంను ప్రభుత్వం కోనుగోలు నచేస్తుందని తహసీల్దార్ వి. నాగభూషణం అన్నారు. మండలంలోని పాములపాడు ఆర్‌బీకే కేంద్రంలో ఉన్న ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఆయన తనీఖీ బుధవారం చేశారు. ఈసందర్బంగా ఆర్‌బీకే వచ్చిన రైతులు రంగు మారిన ధాన్యన్ని సిబ్బంది కోనుగోలు చేయటం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన తహసీల్దార్ రైతుల నుంచి వచ్చిన పాయ ,రంగు మారిన ధాన్యం కోనుగోలు చేయాలని ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు.అనంతర ఆర్‌బీకేలో ఇప్పటి వరకు ఎంత ధాన్యం కోనుగోలు చేశారో అడిగి తెలుసుకున్నారు. సంచులు రైతులకు ఇచ్చే విషయంలో సరైన సమాచారం లేకపోవటంతో ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐ సత్యమానీ, వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగు నింపిన బ్రెయిలీ

ఎంఈవో విజయలక్ష్మి



బ్రెయిలీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో విజయలక్ష్మి, కళా పరిషత్ సభ్యులు

పామర్రు: అంధుల జీవితాల్లో వెలుగులు నింపినమహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని పామర్రు ఎంఈవో పీ విజయలక్ష్మి అన్నారు. స్థానిక బాలికల పాఠశాలలోని భవిత కేంద్రంలో పామర్రు కళా పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆంధులను అందరూ సహృదయంతో ఆదరించాలన్నారు. అంధులకు బోధించడం కోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కళా పరిషత్ అధ్యక్షుడు ఎస్ త్రివిక్రమరావు, గౌరవ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, డైరెక్టర్ వైఎస్‌ఎన్ ప్రసాద్, హెచ్‌ఎం కే లక్ష్మీకుమారి, భవిత కేంద్ర నిర్వాహకులు కే మరియన్న, సీఆర్పీ నందిపు వెంకట నాంచారయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం వేలం

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ జెడ్పీ హైస్కూల్‌లో శిథిలావస్థలో ఉన్న పాత భవనం పడగొట్టి రాయి, కలపను బుధవారం రాయి బహిరంగ వేలం నిర్వహించిన్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ కోలంటి రంగారావు తెలిపారు. ఈ వేలం పాటలో అబ్దుల్ సుకుమార్ రూ.1.22 లక్షకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. వేలం ద్వారా వచ్చిన నగదును జిల్లా పరిషత్‌కు చలనా ద్వారా చెల్లించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరిడెంట్ రమణారావు, హెచ్‌ఎం కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కైకలూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ కురేళ్ల బేబీ అన్నారు. భుజబలపట్నం, ఆలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ నిధులతో రూపొందించిన 'స్ఫూర్తి' పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. భుజబపట్నం ఎంపీటీసీ పెన్మత్స సూర్యనారాయణరాజు, మండల కో-ఆప్షన్ సభ్యుడు సోమల శ్యామ్‌సుందర్, గ్రామ పెద్ద గురజాల వేణు, హెచ్‌ఎం ఎస్.లక్ష్మీరాజేశ్వరీ, ఆలపాడు సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి, ఎంపీటీసీ నల్లగచ్చు ధనలక్ష్మీ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు సీహెచ్.శిరిషా, హెచ్‌ఎం చప్పడి సారథి, ఉపాధ్యాయురాలు హేమలత పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: చోడవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చోడవరం గ్రామానికి చెందిన కిలారు నాగేశ్వరరావు బైక్ పై పెనమలూరు నుంచి చోడవరంలో ఇంటికి వెళ్తున్న సమయంలో నాగేంద్రస్వామి గుడి వద్ద ఎదురుగా వచ్చిన ఆటో అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలుకు తీవ్ర గాయమయింది. పోరంకి ఆస్పత్రిలో అతనిని చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో మరో మహిళకు ..

కానూరు మహదేవపురంకాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహదేవపురంకాలనీకి చెందిన ఎస్.నాగవిమలభారతి ఇంటి సమీపంలో ఉన్న సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఆమెను ఢీ కొట్టింది. ఆమెకు ఈ ఘటనలో గాయాలు అవ్వటంతో కానూరులో ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.